క్లుప్తంగా

విద్యుత్‌కు రేపు అంతరాయం

దేవరపల్లి: దేవరపల్లి సెక్షన్ పరిధిలోని బుచ్చియపాలెం, అచ్చియపాలెం గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఆపరేషన్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనుల కోసం 33/11 కేవీ రామన్నపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ బుచ్చియపాలెం ఫీడర్‌పై ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ విద్యుత్ ఉండదన్నారు.

విద్యార్థికి ఉపకార వేతనం అందజేత



విద్యార్థికి ఉపకార వేతనం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

దేవరపల్లి: మెడిసిన్ చదువుతున్న దేవరపల్లి మండలం చిన్నాయగూడేనికి చెందిన విద్యార్థి వంపుగడప బాబుకి పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా శుక్రవారం రూ.5 వేల ఉపకార వేతనం అందజేశారు. గత నాలుగేళ్లుగా విద్యార్థికి ఉపకార వేతనం అందజేస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సోమిశెట్టి వెంకట్రావు, సత్యనారాయణ, బాబూరావు, బి.నాగమణి, జి.బాబు, ఎస్.నాని తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సులు

దేవరపల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 3 ఎఫ్ ఆయిల్ పామ్ ప్రైవేటు లిమిటెడ్ సంయుక్తంగా గ్రామాల్లో రైతులకు పంట సాగుపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లో 50 గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు సంస్థ హెడ్ శ్రీనివాసరావు తెలిపారు.

డెల్టా కాలువలకు రేపు నీరు విడుదల



విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి ప్రధాన కాలువకు విడుదలవుతున్న గోదావరి జలాలు (ఫైల్)

నిడదవోలు: సాగునీటి అవసరాల నిమిత్తం పశ్చిమ డెల్టా కాలువలకు ఆదివారం నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు జలవనరుల శాఖ ధవళేశ్వరం ఎస్ఈ కె.గోపీనాథ్ తెలిపారు. విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి ఆ రోజు ఉదయం 11 గంటలకు ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు, గోదావరి డెల్టా శెట్టిపేట సర్కిల్ అధికారులు కలసి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత నీటిని విడుదల చేస్తారన్నారు. ఏప్రిల్ 27న కాలువలకు నీటి విడుదల నిలిపివేశారు. తిరిగి 33 రోజుల తరువాత పూర్తిగా నీటి విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్‌ను మామిడి తోరణాలు, అరటి చెట్లతో సుందరంగా అలంకరించారు. విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్‌లో ఉన్న గేట్లను ఎత్తి ముందుగా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. అనంతరం దశల వారీగా నీటి విడుదలను పెంచుతామని అధికారులు తెలిపారు.

వైభవంగా కోదండ రామాలయం పునః ప్రతిష్ఠ

సీటీఆర్ఐ: సారంగధరమెట్ట వద్దగల బర్మా కాలనీలో అజ్జరపు వాసు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మీగణపతి, కోదండరాముడు, సుబ్రహ్మణ్యం, సాయి సహిత దేవాలయం పునఃప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం విగ్రహాల ప్రాణప్రతిష్ఠ అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మానే దొరబాబు, ఎం.శేఖరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



వ్యాన్‌లోనే మృతి చెందిన డ్రైవర్

దేవరపల్లి: రాజమహేంద్రవరం వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ట్రాలీ లారీని గుండుగొలను – కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద శుక్రవారం వెనుక వైపు నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. మృతుని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, మృతదేహాన్ని గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఆ కుర్చీ ఎవరికో..!

- మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి కోసం 'కూటమి' పాకులాట
- వచ్చే నెల 2న ఎన్నిక

నిడదవోలు: నిడదవోలు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక రసవత్తరంగా మారింది. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి తన పదవికి రాజీనామా చేయడంతో ఆ పదవి ఖాళీ అయ్యింది. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వచ్చేనెల 2న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి తెలిపారు. రాజమహేంద్రవరం ఏపీఎంఐడీ పీడీ ఎ.దుర్గేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నారు. పురపాలక సంఘ పాలకవర్గంలో జనసేన పార్టీకి 15 మంది సభ్యుల బలం ఉంది. ఇందులో టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావుతో పాటు ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఓటుతో కలుపుకొని జనసేనకు 15 మంది బలం ఉంది. వైఎస్సార్ సీపీకి 14 మంది కౌన్సిల్ సభ్యులు ఉన్నారు.

ఎంతమంది గెలుపొందారంటే..

నిడదవోలు మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులు ఉన్నాయి. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి ఏకంగా 27 మంది కౌన్సిలర్లు విజయం సాధించారు. టీడీపీ నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన కారింకి నాగేశ్వరరావు కౌన్సిలర్‌గా గెలుపొందారు. జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో జనసేన కుట్ర రాజకీయాల్లో భాగంగా ప్రలోభాలకు గురైన 13 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు జనసేనలో చేరారు.



నిడదవోలులో మున్సిపల్ కార్యాలయం

పార్టీలో మల్లగుల్లాలు

2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 4వ వార్డు కౌన్సిలర్‌గా వెంకటలక్ష్మి గెలుపొందారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆమెకు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు వైస్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించారు. తర్వాత రాజకీయాల నేపథ్యంలో వెంకటలక్ష్మి వైఎస్సార్ సీపీని వీడి జనసేనలో చేరారు. దీంతో వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఇప్పటికే మున్సిపల్ పాలకవర్గాన్ని దక్కించుకున్న జనసేన మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ఎవరికి కట్టబెట్టాలో తెలియక మల్లగుల్లాలు పడుతోంది. వైఎస్సార్ సీపీ నుంచి గెలుపొందిన కౌన్సిలర్ పువ్వల రతీదేవి జనసేనలో చేరడంతో ఆమె వైస్ చైర్మన్ పదవిపై ఆశ పెంచుకున్నారు. మరోపక్క టీడీపీ నుంచి గెలుపొందిన కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు కూడా వైస్ చైర్మన్ బరిలో ఉన్నారు. కూటమి పొత్తు ధర్మంలో భాగంగా టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావుకి వైస్ చైర్మన్ పదవిని కట్టబెడతారా అనే అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయంశమైంది. ఇప్పటికే కూటమి నేతల మధ్య వర్గ విభేదాలు చాపకింద నీరులా నడుస్తున్నాయి. టీడీపీ, జనసేన పార్టీల మధ్య అసమ్మతి సెగలు పెరుగుతున్నాయి. జనసేన నేతలు ప్రాధాన్య ఇవ్వడం లేదని టీడీపీ శ్రేణులు ఆగ్రహంతో ఉన్నారు. ఇటీవల పట్టణ టీడీపీ అధ్యక్షుడు తన పదవికి రాజీనామా కూడా చేశారు. టీడీపీ పెద్దల జోక్యంతో రాజీనామాను విరమించుకుని పదవిలో కొనసాగుతున్నారు. ఈ వర్గ విభేదాల నేపథ్యంలో వైస్ చైర్మన్ పదవి ఎవరికి ఇస్తారోనని చర్చ సాగుతోంది.

నిజాయితీగా నిలబడ్డ బాలరాజు

గత మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి **18వ వార్డు కౌన్సిలర్‌**గా రెండో సారి విజయం **సాధించిన ఎస్సీ సా**మాజిక వర్గానికి చెందిన **యలగాడ బాలరాజు**కి ప్రాధాన్యం ఇస్తూ వైఎస్సార్ సీపీ **ఇన్‌చార్జి**, మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు **రెండో** వైస్ చైర్మన్‌గా ఎంపిక **చేశారు. ఆయన ఎటు**వంటి ప్రలోభాలకు గురి **కాకుండా నిజాయితీ**గా వైఎస్సార్ సీపీలోనే **ఉన్నారు. ఎవరెన్ని** ప్రలోభాలకు గురిచేసినా, **ఎంత ఒత్తిడి చేసినా** వైస్ చైర్మన్ బాలరాజు నిజాయితీగా నిలబడ్డారు. తాను వైఎస్సార్ సీపీ ద్వారా గెలిచాలని, ఈ పార్టీలోనే కొనసాగుతానని తేల్చి చెప్పారు.

దళిత యువకుడిపై దాడి అమానుషం

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు

నల్లజర్ల: తెనాలిలో దళిత, మైనార్టీ వర్గాలకు చెందిన ముగ్గురు యువకులపై నడిరోడ్డుపై పోలీసులు హింసకు పాల్పడటం అమానుషం అని నల్లజర్ల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. ఆ ఘటనపై నిరసన వ్యక్తం చేస్తూ గంటావారిగూడెం వైఎస్సార్ విగ్రహం వద్ద శుక్రవారం మండల ఎస్సీసెల్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు విలేకరులతో మాట్లాడుతూ ఈ దాడి ఉద్దేశ పూర్వకంగా జరిగినట్టు తాము భావిస్తున్నామన్నారు. ఇందులో కుట్ర దాగి ఉందన్నారు. బాధిత యువకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని అతిక్రమించి పోలీసులు హింసకు పాల్పడటం దారుణమన్నారు. ఈ కేసులో మానవ హక్కుల సంఘం జోక్యం చేసుకోవాలని కోరారు. లీగల్ సెల్ అధ్యక్షుడు గోగుల మండ బాబ్జి, తాడిగడప శ్రీనివాసరావు, తోటవెంకట్రావు, ఈడే నిర్మల పాల్గొన్నారు.

అప్పుల్లో చంద్రబాబు రికార్డు

- తొలి ఏడాదే రూ.1.37 లక్షల కోట్ల అప్పు
- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విమర్శ

చాగల్లు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే రూ.1.37 లక్షల కోట్లు అప్పులు చేసి చంద్రబాబు రికార్డు సృష్టించారని, ఇన్ని అప్పులు చేసినా ఒక్క సంక్షేమ పథకాన్నీ అమలు చేయలేదని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ధ్వజమెత్తారు. చాగల్లులో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే మాజీ సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ కొనసాగించడంతోపాటు అంతకంటే ఎక్కువగా సంక్షేమం అందిస్తానంటూ ప్రతి ఎన్నికల సభలోనూ చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ప్రజలను మోసం చేశారన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నింటినీ రద్దు చేశారని అన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చేసి చూపారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అప్పులు చేసిందని.. రాష్ట్రాన్ని శ్రీలంకలా మార్చేసిందంటూ ఎన్నికల ముందు చంద్రబాబు, టీడీపీ నేతలు దుష్ప్రచారం చేశారని అన్నారు.



మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

రాష్ట్ర విభజన జరిగే నాటికి అంటే 2014 జూన్ 2 నాటికి రాష్ట్ర అప్పు రూ.1,47,717 కోట్లు కాగా, 2019లో చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ.3,90,247 కోట్లకు చేరుకుందని అన్నారు. ఆ ఐదేళ్లలో ఏటా 22.63 శాతం అప్పులు పెరిగాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ.7,21,918 కోట్లు అని, అంటే 2019–24 మధ్య ప్రభుత్వం చేసిన అప్పు రూ.3,32,671 కోట్లు అన్నారు. ఆ ఐదేళ్లలో ఏటా సగటున 13.57 శాతం మాత్రమే అప్పులు పెరిగాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అప్పులో రూ.2.73 లక్షల కోట్లను సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో పేదల ఖాతాల్లో జమ చేశారన్నారు. 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిలోనే రూ.1,37,546 కోట్ల అప్పు చేసిందని అన్నారు.

వైద్య, వ్యవసాయ రంగాలు నిర్వీర్యం

రాష్ట్రంలో వైద్య, వ్యవసాయ రంగాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఆరోగ్యశ్రీని అటకెక్కించిందని మాజీ ఎమ్మెల్యే తలారి అన్నారు. రైతన్నలకు పెట్టుబడి సాయం అందించకుండా అప్పుల పాలు చేసిందని విమర్శించారు. చదువుకునే పిల్లలు, రైతన్నలు, మహిళలు, నిరుద్యోగులను మోసగించిందని దుయ్యబట్టారు. 2.60 లక్షల మంది వలంటీర్లను రోడ్డున పడేసిందని, ఇంటి వద్దకే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో 9,280 మంది ఆపరేటర్లు వీధుల పాలయ్యారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారదర్శకత కోసం తెచ్చిన జ్యుడీషియల్ ప్రివ్యూ వ్యవస్థ, రివర్స్ టెండరింగ్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని తలారి వెంకట్రావు అన్నారు.

రేపటి నుంచి పడిగాపులే..!



రేషన్ షాపు వద్ద సర్వర్ పనిచేయక నిరీక్షిస్తున్న వృద్ధులు, మహిళలు (ఫైల్)

- రేషన్ బండి సేవలకు స్వస్తి
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు

నల్లజర్ల: పేద, సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. నిన్నటి వరకు ఇంటి ముందుకు వచ్చి రేషన్ ఇచ్చే ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించారు. ఇంటి గుమ్మంలో అందుకునే బియ్యం రేపటి నుంచి రేషన్ షాపుల వద్ద క్యూలు కట్టాల్సిందే. మళ్లీ పాత రోజులు వచ్చాయా అంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. రేషన్ డిపోల వద్ద నిలబడలేక, సర్వర్ బాగా లేదని పలుమార్లు రేషన్ డిపోల చుట్టూ తిరగాల్సి రావడం, బియ్యం మూటలు మోయలేక కూలబడిపోవడం వంటి రోజులు పునరావృతం కానున్నాయి.

ఎండీయూ సేవలకు మన్ననలు

ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించిన సమస్య నేపథ్యంలో ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే రాష్ట్రవ్యాప్తంగా వాహనాలు కొనుగోలు చేసి, ఎండీయూగా నామకరణం చేయడం, వాహనాలకు ఆపరేటర్, అసిస్టెంట్‌ను ఏర్పాటు చేసి గడప వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఎండైనా, వర్షం వచ్చినా సరే ఇంటి గుమ్మం ముందుకొచ్చి, బయోమెట్రిక్ వేయించుకుని వాహనంలోని రేషన్ సరకులను అందించేవారు. ఇటువంటి సేవలు నిలిపివేయడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సారా రహిత మండలంగా ఉండ్రాజవరం

ఉండ్రాజవరం: ఎక్సైజ్ సిబ్బంది కృషి, పోలీస్ అధికారుల సహకారంతో నేడు పూర్తి సారా రహిత మండలంగా ఉండ్రాజవరం మారిందని నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్.జయరామ్ సతీష్ తెలిపారు. ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎక్సైజ్, రెవెన్యూ, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గతంలో నాటు సారా కేసులు నమోదైన తాడిపర్రు, మోర్త, దమ్మెన్ను, ఉండ్రాజవరం గ్రామాలను సీ కేటగిరీ గ్రామాలుగా వర్గీకరించినట్లు తెలిపారు. అనంతరం సారా కేసుల్లోని నిందితుల ప్రస్తుత స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించడం ద్వారా, రెండేళ్లలో పైన తెలిపిన గ్రామాల్లో సారాకి సంబంధించిన కేసులు నమోదు కాలేదన్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ఉన్న సారా నిందితులు వారి జీవనభృతి కోసం వేరే వృత్తుల్లోకి మారిపోయారన్నారు. తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీఓ వి.రామారావు, నిడదవోలు ఎక్సైజ్ ఎస్సై బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరాన్ని సారా రహిత మండలంగా ప్రకటిస్తున్న ఎక్సైజ్ సీఐ సతీష్ తదితరులు

కోకోకు రూ.500 మద్దతు ధర



రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి బబిత

నల్లజర్ల: కోకో పంటకు ప్రభుత్వం కిలోకు రూ.500 మద్దతు ధర ప్రకటించిందని ఉద్యాన శాఖాధికారి ఎం.బబిత తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలోని వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన శాఖ సంయుక్త ఆధ్వర్యాన ప్రకాశరావుపాలెం, అవపాడు, సింగరాజుపాలేల్లో శుక్రవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా బబిత మాట్లాడుతూ, బయటి మార్కెట్‌లో కిలో కోకో గింజల ధర రూ.450 ఉంటే మిగిలిన రూ.50 ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. వివరాలకు రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా వివిధ పంటల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలు, వరి, కూరగాయల సాగులో సమస్యలు, యాజమాన్య పద్ధతులు, ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకోలో యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్తలు వివరించారు. రైతుల సందేహాలను మార్టేరు వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఆయిల్‌పామ్ జాతీయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు రామచంద్రుడు, మేరీ రాణి, ప్రేమలత, వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పి.వి జయలక్ష్మి, వి.దీప్తి, దుర్గాప్రసాద్‌రెడ్డి రైతులకు వివిధ అంశాలను వివరించారు. వ్యవసాయాధికారి కమల్ రాజ్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు.

ధాన్యం సొమ్ము ఎప్పుడిస్తారు..!



ఉండ్రాజవరంలో తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఉండ్రాజవరం: ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులకు ఈ ప్రభుత్వంలో కష్టాలు తప్పడం లేదు. కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో పాటు కొన్న ధాన్యానికి డబ్బు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దాళ్వాలో రైతుల నుంచి ప్రతి గింజా కొనుగోలు చేస్తామని చెప్పిన నాయకులు, అధికారులు ఇప్పుడు సొమ్ములు ఇచ్చే సమయానికి పత్తా లేకుండా పోయారని ఆరోపిస్తున్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఉండ్రాజవరం మండలంలోని రైతులు ఏప్రిల్‌లో రైస్ మిల్లులకు తోలిన ధాన్యానికి నేటికీ డబ్బులు జమ కాలేదని ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ ఏప్రిల్‌లో అమ్మిన ధాన్యానికి నేటి వరకు రైతుల ఖాతాల్లో సొమ్ము జమ కాలేదని అన్నారు. సుమారు నెల రోజులు కావొస్తున్నా డబ్బుల విషయంలో మిల్లర్లు, అధికారుల నుంచి ఏవిధమైన సమాధానం రావడం లేదన్నారు. ఒకపక్క వాతావరణం సహకరించకపోవడంతో అయినకాడికి ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని అన్నారు. ఒక్క రోజులోనే ధాన్యం డబ్బులు జమ అంటూ చెప్పిన ప్రభుత్వం నెల రోజులు కావొస్తున్నా చెల్లించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ పంట వేసేందుకు సమయం దగ్గర పడటంతో సొమ్ము లేకుండా ఎలా సాగేదని అంటున్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, పెన్నేటి బాలకృష్ణ, అక్కిన గోపాలకృష్ణ, కడలి శ్రీను, చెట్టే శ్రీనివాసు, కె.రాఘవులు, ఈద్పుగంటి శ్రీనివాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ ఇవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో, కొవ్వూరు
గార్డియన్ వార్డ్స్ ఓ.పి.నెం.17/2025
(గార్డియన్ అండ్ వార్డ్స్ చట్టం 1890)

[illegible]

మరియు

[illegible]

బి.భారతి, బి.ఎల్.,
అడ్వకేట్ కొవ్వూరు
సెల్ : 94937 18855

యోగాంధ్రలో భాగస్వామ్యం కావాలి



పెరవలి ఆరోగ్య కేంద్రం వద్ద యోగాసనాలు వేస్తున్న వైద్య సిబ్బంది

పెరవలి: యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పీహెచ్‌సీ డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. పెరవలి ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం వైద్య, ఆశ సిబ్బంది యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, దీనిని క్రమం తప్పకుండా చేస్తే మనసుకు ప్రశాంతత కలుగుతుందన్నారు. వైద్య సిబ్బంది అనేక ఒత్తిడిలు ఎదుర్కొంటున్నారని, దీనిని అధిగమించాలంటే యోగా తప్పనిసరి అని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారికి చక్రస్నానం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): లాలాచెరువు వద్ద గల గోవింద క్షేత్రంలో జరుగుతున్న 15వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీవారికి చక్రస్నానం నిర్వహించారు. స్థానిక పుష్కర ఘాట్‌లో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు జరిపారు. శనివారం ఉదయం అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

దేవరపల్లి: యర్నగూడెంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో నిర్మించిన గృహాలను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ సంస్థ ఎండీ ఎం.శివప్రసాద్ పరిశీలించారు. గ్రామంలో సొంత స్థలాల్లో 18 మంది నిర్మించుకున్న గృహాలను ఆయన పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. జూన్ 12వ తేదీ నాటికి గృహాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆయన సూచించారు. గోపాలపురం నియోజకవర్గంలో దేవరపల్లి మండలంలో 35, నల్లజర్ల మండలంలో 36, గోపాలపురం మండలంలో 12 గృహాల నిర్మాణం పూర్తయ్యి ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఒక్కో గృహానికి ప్రభుత్వం రూ. 1.80 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ ఎస్ఈ జయరామాచారి, పీడీ ఎస్.భాస్కరరెడ్డి, డీఈఈ టి.శేఖర్‌బాబు, ఏఈ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



యర్నగూడెంలో ఆవాస్ యోజన గృహాలను పరిశీలిస్తున్న శివప్రసాద్, జయరామాచారి